# మనుషులు కాదు, మరలు !

## శ్రీమతి 'మణిమాల'

"రమా ! – రమా ! లే ! అతిధు లొచ్చారు మనఇంటికి" అంటూ ప్రభాకరం నిద్రలేపాడు.

"ఏమిటండీ నన్ను నిద్రపోనివ్వండి" అని కప్పుకున్న శాలువ తలదాకా లాక్కొని పక్కకు ఒత్తిగిలి పడుకుంది రమ.

ప్రభాకరం. "అతిధు లొచ్చారంటే మరి ప్రక్కకు తిరిగి పడుకున్నావు, లే—ఇంక".

"అర్ధరాత్రి అతిధులేమిటండీ! ఊహూ నేను నమ్మను పోండి" అన్నది రమ.

ప్రభాకరం : "నిశాచరులు నిశీధి సమయంలో రాక మరెప్పుడు వస్తారు ? అయినా ఇప్పుడు తెల్లవారు ఝాము నాలుగున్నర అయింది. లే, మనఇంటికి వచ్చిన అతిధులు సామాన్యులుకారు. పోలీసు అతిధులు. ఇప్పుడైనా నమ్ముతావా ?"

శాలువ తీసేసి చటుక్కున లేచింది రమ. మంచం పక్కనే మేజామీద ఎలక్ట్రిక్ దీపం వెలుగుతున్నది. కళ్ళు తుడుచుకొని భర్తను తేరిపారచూచింది.

"ఏం ? అలా చూస్తున్నావు. ఇంకా నిద్రమంపుపోలేదా ?" అని చిరునవ్వు నవ్వాడు ప్రభాకరం.

"అబ్బ :—అయితే పోలీసు అతిధులే వేంచేశారు మన ఇంటికి ఎంత అదృష్ట మండీ !" అంటూ, తలకట్టు, చీరె సవరించు కొన్నది రమ.

"సోదా చేస్తామంటూ వచ్చారు కాని, అదొకసాకు. అసలు నన్ను అరెస్టు చెయ్యడానికే వచ్చారు ఇలాంటివి మనకు పరిపాటే. లేచి, నా బట్టలూ, పక్కా సర్దేసెయ్యి రమా !" అని చెప్పాడు ప్రభాకరం.

చుట్టుపక్కల ఇండ్ల దీపాలుకూడా వెలిగి, చీకటి పరుచుకొని ఉన్నట్టున్న ఆవరణలో వెలుతురు డాగులుడాగులుగా పడుతున్నది.

"అలాగే ఉండండి. పిల్లల్ని లేపాలి" అంటూ పిల్లల మంచాల గగ్గరకు వచ్చింది రమ.

"శశీ !—రవీ !—తారా ! లేవండి!"

"నాన్నగారికోసం ఎవరో వచ్చారుట. ఊరికి వెళ్లాలిట, లేవండి, త్వరగా ఊ . లేచిరాండి" అని ఒక్కొక్కర్నీ నిద్ర లేపి ముంగురులను సర్ది, నీళ్ళతో వాళ్ళ కళ్ళు తుడిచింది రమ.

ఆలస్యమైపోతున్నా, పాపం ఆవేదన కారణమనుకొని మేడమెట్లు దిగిపోతున్నాడు ప్రభాకరం. రమ కూడా భర్త వెంట ఒక్కొక్క మెట్టే దిగుతూ క్రిందికి వచ్చింది. హాల్లో లైటు వెలిగేసరికి ఇద్దరు యువకులు - పోలీసు ఉద్యోగస్థులు "రమాదేవిగారూ Good

Morning" అంటూ లోపలికి వచ్చారు.

"నమస్కారం. నా పేరు కూడా మీకు తెలిసిందన్నమాట మీకిది సుప్రభాతం కదూ!" అని పకపక నవ్వింది రమ

"సుప్రభాతమా?— కాదు. మాకిది దుర్దినం. మేము చేసుకున్న పాపం.. క్షమించండి" అన్నాడు ఒక పోలీసు ఉద్యోగి

ఇంతలో ప్రభాకరం అడ్డువచ్చి, "రమా! వారిని ఏమనకు వారివిధి వారు నెరవేర్చుకోవాలి కదూ" అని మందలించాడు

"లేదండీ వారిమీద నాకేం కోపం! ఇంత చిన్నతనంలోనే వారికి ఈ దుర్గతి పట్టిందేమా అని పరితపిస్తున్నాను. అంతే"

రమ : "మిష్టర్ "

"ఆఁ"

"మీ పేరెందుకులే....నాకవసరంలేదు కూడా. తమ్ముడంటే చాలుకదూ" అంటూ రమ ఆఫీసు గదికి వెళ్ళింది కిటికీతలుపులుతెరచి బయటకుచూచింది వరండా దీపం వెలుతురులో ఇంటిని చుట్టముట్టి సాయుధులై బారులు తీరి నిల్చున్న పోలీసులు కనిపిస్తున్నారు. తమ బంగళా ఆవరణలో ఒక గుంపు, ఇరుగు పొరుగు ఇండ్లను చుట్టి మరో గుంపు "ఈమాత్రానికే ఇంతమంది పోలీసులా" అనినవ్వుతూ రమ పోలీస్ ఉద్యోగులను గదిలోకి రమ్మనింది వాళ్ళు వచ్చినపని పూర్తి చేసుకోమని చెప్పింది. ఇంతలో అక్కడికి వచ్చిన శశి రవి తమ ఇంటి చుట్టూ నిల్చున్న పోలీసులను చూస్తున్నారు. చిన్నకూతురు తారమాత్రం వాళ్ళను చూసి జడిసింది తల్లిదగ్గరకు పరిగెత్తుకొచ్చి చీరె కుచ్చెళ్ళలో తలదాచుకొన్నది "చిట్టీ, జడుస్తావేం, నిన్నేమీ చెయ్యరమ్మా వాళ్ళు; మనఇంట్లోకి దయ్యమొచ్చిందేమోనని వెతకటానికి వచ్చారు" అని రమ తారను దగ్గరకు తీసుకుంది

"శశీ, రవీ, మీరిద్దరూ నాన్నగారి బట్టలూ, పెట్టీ సర్దండి. పక్కకట్టండి ఏం"అంది రమ పరిస్థితులనుగ్రహించుకొన్న వాళ్ళిద్దరూ ఉడుపుల గదిలోకి వెళ్ళిపోయారు.

ప్రభాకరం పోలీసు ఉద్యోగులను చూచి పకపక నవ్వుతున్నాడు ఎందుకా అని ఇద్దరూ తలెత్తిచూచారు.

"మీకెంత తెలివితేటలులేవు! మీరు వస్తారని మాకు ముందే తెలుసు కాని దూరదృష్టి ఉన్నవాళ్ళం మేము మీ రేకాయితాలకోసం, పుస్తకాల కోసం వచ్చారో వాటిని మచ్చుకు లేకుండాచేసి ఒకనెల అయింది. అయితేనేం—నిరాటంకంగా సోదాచేసుకోండి. కాని మీఅజ్ఞానానికి నాకు నవ్వొస్తున్నది. మరొక మాట-అసలు మీరు వచ్చింది మరోపనికి అనికూడా నేనెరుగుదును తెలుసా"

"సిద్ధమవుతున్నాను" అంటూ గదిలోకి వెళ్ళిపోయాడు. పోలీసు అధికార్లు ఇద్దరూ కొయ్యబారి నిల్చున్నారు

ఇంట్లో గదులన్నీ తలుపులు తీసి, బీరువాలు, పెట్టెలు తెరిచి చూపెట్టి సోదాచేసుకోమనింది రమ

ఒకపోలీసు ఉద్యోగికి 30 ఏండ్లు ఉంటాయి. రెండో ఉద్యోగి 25 ఏండ్ల వాడు. మంచి పొడగరి, స్ఫురద్రూపి

ముసల్మాను. అతని ముఖంలో. పలుకులో, మార్దవం తొణికిసలాడుతున్నది

"ఎక్కడో చూచినట్టుంది ముఖం తనతో ఇందాకటినుంచీ ఎంతో వినయముగా మాట్లాడింది ఇతనే — ఎవరా ఇతను?" అని రమ ఆలోచించుకొన్నది. కాని గుర్తుకు రాలేదు పోలీసులు ఇల్లంతా సోదా చేశారు క్రింద గ్రంధాల గదిమాత్రం మిగిలిపోయింది. ఇంతలో ముసల్మాను ఉద్యోగస్థుడు. రవిని తన వెంట రమ్మని, మేడమెట్లు ఎక్కసాగాడు. రవి అతనివెంట వెళ్ళాడు మరో ఉద్యోగి గ్రంధాలున్న గదిలోకి వెళ్ళి, రమకు ఒకకుర్చీవేసి, కూర్చోమని కోరాడు. రమ కూర్చున్నది. అక్కడి గ్రంధాలను పరిశీలిస్తూ, కొన్ని వైద్య గ్రంధాలనుచూచి "మీపిల్లల్లో ఎవరండీ మెడికల్ కాలేజీలో చదువుతున్నది?" అని అడిగాడు.

"నా పెద్దకూతురు శశి, నాకుమారుడు రవి ఇద్దరూను," అని జవాబు చెప్పింది రమ సంతోషంతో.

ఆ ఇన్‌స్పెక్టర్ ఇంతలో ఒకపెట్టెను చూచి తనదగ్గరకు లాక్కొన్నాడు రమ పొట్టచెక్కలయ్యేట్టు నవ్వసాగింది. చప్పుడువిని ప్రభాకర్ గదిలోకివచ్చి, "రమా! ఏమిటి ఈవేళాకోళం, వాళ్ళను నెమ్మదిగా సోదా చేసుకోనివ్వవూ మరి" అన్నాడు.

పాపం ఇంత కష్టపడి ఇల్లంతాసోదా చేస్తే, చివరకు వాళ్ళకు చిక్కింది ఏమిటో కాస్త చూడండంటూ రమ మరల నవ్వసాగింది.

ఇన్‌స్పెక్టరు పెట్టెమూతనుతెరిచాడు వట్టి ఎముకలు! - మానవ అస్థిపంజరం. వైద్య విద్యార్థులకు పనికివచ్చేవి. కిటికీలోనుంచి తెల తెల వెలుతురు వస్తున్నది ఇన్‌స్పెక్టరు ముఖం వెల వెలబోయింది ప్రభాకరుని ముఖంలోని వింత కాంతి, పెదిమలమీద చిరునవ్వు చూచి పోలీసు అధికారులు లజ్జతో తల వంచుకున్నారు

ఇంతలో మేడమీదికి వెళ్ళిన ముసల్మాన్ పోలీసు ఉద్యోగి క్రిందికి దిగివచ్చాడు. ఎవరితోనూ మాట్లాడలేదు. హాల్లోకివచ్చి ఒక కుర్చీలో జేరగిలబడి నిట్టూర్పు విడిచాడు

ఇప్పటికి సోదా పూర్తిఅయింది మొదటి పోలీసు ఉద్యోగి రమా-ప్రభాకరులను చూచి, "ఏమండీ ప్రభాకరం గారూ! స్నానంచేసి, కాఫీ పుచ్చుకోండి మీరు మావెంట రావలసిన పనిఉంది" అని మెల్లగా అన్నాడు. "నేను సిద్ధంగా ఉన్నాను"అని జవాబు చెప్పి, రమను కాఫీ తయారు చేయించమన్నాడు ప్రభాకరం. వంటగదిదగ్గరకు వెళ్ళి తటాలున తిరిగి వచ్చింది రమ.

"ఏ సెక్షన్‌క్రింద నాభర్తను అరెస్టు చేశారు? ఏదీ వారంటు చూపెట్టండి"అని పోలీసు అధికార్లను ప్రశ్నించింది ఆమె కంఠంలో, కళ్ళల్లోధైర్యం ప్రతిధ్వనించి ప్రతిబింబిస్తున్నది ఎంతో గంభీరంగా మాట్లాడు తున్నది.

రెండవ అధికారి తలవంచుకుని చూస్తూకూర్చున్నాడు. మొదటిఉద్యోగి "రమాదేవిగారూ ఏసెక్షన్ ఐతే ఏమిటి? మేముచెప్పలేం. అరెస్టుమాత్రం...." రమ ఆయనవాక్యం పూర్తిచెయ్యక

ముందే అడ్డువచ్చి. "సెక్షన్ కూడా చెప్పరూ? అసలుమీకు తెలిస్తేగా చెప్ప టానికి ఇకవారంటుకూడా లేదూ? ఇంత అరాచకం! పైగా ప్రజాప్రభుత్వం అంటూ డప్పులు వాయించుకోటం కూడాను. ఛీ! సిగ్గు! సిగ్గు!" అని మళ్ళీ వంటగది దగ్గరకువెళ్ళింది

ఇంతలో ప్రభాకరం పిల్లలతో పరి హాసాలాడుతూ వాళ్ళందించిన ఖద్దరు చొక్కా, ఖద్దరు ఉత్తరీయం వల్లెవాటు వేసుకున్నాడు. హాలుకు, ఆఫీసుగదికి మధ్య నిల్చున్నాడు ఒక ట్రేలోమూడు కప్పులు కాఫీని ఉంచుకుని అక్కడకు వచ్చింది రమ తమ్ముడూ అని ప్రత్యే కంగా ఒక్కొక్కర్నీసంబోధిస్తూ కాఫీని అందించబోయింది పోలీసు ఆఫీసర్లు ఇద్దరూ రమవంక నివ్వెరపోయి చూస్తు న్నారు

"మామీదగూడా మీకింతదయా!" అన్నారు వాళ్ళిద్దరూ. కాఫీఅందుకుంటు న్నప్పుడు వాళ్ళచేతులు గడగడ వణక సాగాయి.

వాళ్ళిద్దర్నీ రమ కాఫీ తాగమంది. ప్రభాకరం దగ్గరకు వచ్చింది "ఏమండీ నా చేత్తో కాఫీని.... మరెప్పుడో!" "రమా నీచేతి కాఫీని మరెన్నాళ్ళకో"

ఇద్దరి పెదిమలు ఒకసారి కదిలాయి! ఇద్దరిమాటలూ ఒక్కసారి వెలువడ్డాయి ఇద్దరిముఖాలమీదా ఒక్కసారి మబ్బులు కమ్ముకున్నాయి!

ఒకరి నొకరు ఒక్కక్షణం చూచు కొన్నారు!

రమ తలవంచుకొని "పుచ్చుకోండి ...కాఫీ" అని అందించింది. ప్రభా కరం చేతిమీద రెండు అశ్రుకణాలు రాలాయి.

"రమా ఏమిటది?" అన్నాడు ప్రభా కరం ఇంతలో రమ తన నోటిమీద వేలుపెట్టుకొని, 'ఊరుకొమ్మని' సౌజ్ఞ చేసి, వంటగదిలోకి వెళ్ళిపోయింది

పెట్టె, పరుపులు పనివాళ్ళు వసారా లోకి తెచ్చిపెట్టారు 'రమా' అని పిలి చాడు ప్రభాకరం. రమ వచ్చింది. ఆమె ఎంతో ప్రసన్నంగా ఉంది.

"రమా! మన మేడమీద పతాకాన్ని ఎగురవెయ్యి. మనందరం సెల్యూట్ చెయ్యాలి" అన్నాడు ప్రభాకరం

వెంగున ఒక గంతువేసి శశి, రవి, తారలు మేడమీదకు వెళ్ళారు. పతాకాన్ని ఎగురవేశారు. అన్నివైపులా అరుణ కాంతులు అల్లుకపోయినై అంత రిక్షంలోఎగిరే అరుణపతాకను చూస్తున్న రమా—ప్రభాకరుల కళ్ళలో అమరజ్యోతి ప్రజ్వలిస్తున్నది అక్కడ గుమిగూడిన ప్రజలముఖాల్లో ఆశారేఖలు మిలమిల్లాడు తున్నాయి. రమా—ప్రభాకరులు; పిల్లలు "స్వతంత్ర భారత్‌కు జై! అరుణ పతాకకు జై!" అని సెల్యూట్ చేస్తూ జయధ్వానాలు చేశారు

"స్వతంత్ర భారత్‌కు జై! అరుణ పతాకకు జై!" అని అన్నిమూలలా మారుమ్రోగింది

ప్రభాకరం పిల్లలొక్కరొక్కర్నీ ముద్దుపెట్టుకొని వీపుమీద నిమిరాడు. రమ వైపుకు మళ్ళి, చేతిని పట్టుకొని "రమా! సెలవు —" అని రమ

ముఖాన్ని ఒక్కక్షణం చూచాడు రమ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి

ఈ దృశ్యాన్ని చూస్తూ ఉన్న మొదటి ఉద్యోగి, రెండవ ఉద్యోగిని "హమీద్! సిగరెట్టు ఇవ్వరా" అని అడిగాడు హమీద్ కంటనీరు తుడుచుకుంటూ 'ఒరే! నువ్వు మనిషివికాదూ! మిషన్ పుత్రా?' అని ఏవగించుకొన్నాడు

మొదటిఉద్యోగి చేతి బెత్తంఊపుతూ బొమ్మల్లే నిల్చున్నాడు! ఇద్దరు ఇన్‌స్పెక్టర్లూ, ప్రభాకరం మెల్లిగా నడువసాగారు. గేటుదాటేసరికి రమ ప్రభాకరం, పిల్లలు చుట్టూ జనం గుంపులు గుంపులుగా చేరారు.

బయట భూతంలాగా నిల్చుని ఉన్న లారీలో ప్రభాకరాన్ని ఎక్కించారు అటూఇటూ సాయుధులైన పోలీసులు నిల్చున్నారు

ప్రభాకరం పిల్లలవంక చూస్తూ నిల్చున్నాడు

రమ రెండడుగులు ముందుకు వేసేసరికి లారీ ప్రక్కకు తిరిగి పోయింది ప్రభాకరం వంకే చూస్తున్న ప్రజలు జయజయధ్వానాలు చేస్తున్నారు.

చుట్టుపక్కలవాళ్లు, అక్కడ గుమికూడిన కూలినాలి చేసుకునే పాటకజనం, పట్టపగలు ఇట్లా అన్యాయంగా, కారణమైనా చెప్పలేనప్పుడు ప్రజలకు తల్లో నాలుకలాగా, చేదోడువాదోడుగా ఉండే ప్రభాకరాన్ని పట్టుకపోవడం అన్యాయమని అసహ్యించుకుంటున్నారు

ఒకరు: శాసనం! — దేశరక్షణ శాసనం, ప్రజాసేవకుల నిర్బంధించను చేశారట

మరొకరు: "దేశం మేలుకేనట — ఈ దుర్మార్గం!"

లారీచక్రాల గరగర వినిపిస్తున్నది

ఆ గుంపులో ఇంకొకరు "వీళ్ళు మనుషులు కాదు మరలరా"

"ఒక్క రమకేకాదు—ప్రజలందరికీ" లారీచక్రాల గరగర దూర దూరంగా వినిపిస్తున్నది. వాళ్ళకు ప్రభాకరం ఇంకా కళ్ళకు కట్టినట్టున్నాడు!

అంతరిక్షంలో ఎగిరే అరుణపతాక— ప్రజలందరి హృదయాల్లో ఆశారేఖల విరజిమ్ముతూ, ఠీవిగా ముందు దారి చూపుతున్నట్టు, రమ్మని వేయిచేతులతో పిలుస్తున్నది!